మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి

జిల్లాలో మహిళా సంఘాలకు 16 మీ- సేవ కేంద్రాల కేటాయింపు • స్త్రీ నిధి ద్వారా రుణ సదుపాయం



సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకొని మహిళా సంఘాలు చిరు వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతున్నారు. ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి స్వయం సహాయక సంఘాల సభ్యులతో మహిళా శక్తి మీ–సేవ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అవన్నీ గ్రామ పంచాయతీ, రైతు వేదికతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రం నిర్వహణ బాధ్యత గ్రామైక్య సంఘాల(వీవో)కు అప్పగించింది.

స్త్రీనిధి ద్వారా రుణం

మీ–సేవ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.2.50 లక్షల రుణం స్త్రీనిధి ద్వారా అందజేస్తారు. అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తీసుకున్న రుణం కేంద్రం ప్రారంభమైన తర్వాత నెలనెలా చెల్లించాల్సి ఉంటోంది. గ్రామైక్య సంఘాల వద్ద డబ్బులుంటే ఆయా పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చు. లేని వారు మాత్రం రుణం పొందాల్సి ఉంటోంది.

చదువుకున్న సభ్యులకు అప్పగింత

గ్రామ సమాఖ్యల్లో (వీవో) చదువుకున్న సభ్యురాళ్లను మీ–సేవ కేంద్రం ఆపరేటర్లుగా ఎంపిక చేశారు. త్వరలోనే వీరికి కేంద్రం నిర్వహణ, మీ -సేవ ద్వారా అందించే సేవలపై శిక్షణ ఇస్తారు. జిల్లాలో పదుల సంఖ్యలో మీ–సేవ కేంద్రాలున్నాయి. వాటికి తోడుగా ఇంకా పారదర్శకమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

మండలాల్లో మీ–సేవ కేంద్రాలిక్కడే ..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 16 మీ–సేవ కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగానికి ప్రతిపాదనలు చేశారు. మండలాల వారీగా మీ–సేవ కేంద్రాలను ఏర్పాటు చేయనున్న వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మేడ్చల్ మండలం పరిధిలో రాయల్‌పూర్, డబుల్‌పూర్-వీటీ1, డబుల్‌పూర్-వీటీ2, ఘట్కేసర్ మండలం పరిధిలో ఎదులాబాద్, ప్రతాప్‌సింగారం, కొర్రెముల-వీ2, కొర్రెముల-వీటీ3, కీసర మండలం పరిధిలో యాద్గార్‌పల్లి-వీటీ3, కీసర-వీటీ2ల్లో మీ–సేవ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే, శామీర్‌పేట మండలం పరిధిలోని అలియాబాద్, లాల్‌గడ్ మలక్‌పేట్, మూడుచింతలపల్లి మండలం పరిధిలోని మూడు చింతలపల్లి గ్రామంలో, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, జగ్గంగూడ గ్రామాల్లో మీ–సేవ కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా మల్లారెడ్డి వర్సిటీ స్నాతకోత్సవం



పట్టాలు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనివర్సిటీ వీసీ

మేడ్చల్ రూరల్: మల్లారెడ్డి యూనివర్సిటీకి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మెన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో మొదటి స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, రిజిస్ట్రార్ ఆంజనేయులు, యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ భద్రారెడ్డి, డైరెక్టర్లు షాలినీరెడ్డి, ప్రీతిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డిలు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల విద్యనభ్యసించిన మొదటి బ్యాచ్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యను పూర్తి చేసుకొని రూ. లక్షల ప్యాకేజీతో బయటికి వెళ్తున్న విద్యార్థులు సమాజంలో మంచి గుర్తింపు పొందాలన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మేడ్చల్: ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఇచ్చిన పిలుపు మేరకు మేడ్చల్ పట్టణంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు.పట్టణంలోని గడిమైసమ్మ తల్లి ఆలయ ఆవరణలో నాయకులు కలిసి మొక్కలు నాటి నీరుపోశారు. బీజేపీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పట్టణ బీజేపీ నాయకులు ఆంజనేయులు,సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఇంటికి పంపించే చర్యలను మానుకోవాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను తక్కువ డబ్బులతో ఈనెల 24 తర్వాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మేడ్చల్ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి యూనియన్ జిల్లా ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. అలాగే,జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణారెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించారు.రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ. రెండు లక్షలు , హెల్పర్లకు రూ. లక్ష ఇవ్వాలని కోరారు. పెన్షన్,వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగనవాడి టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శోభారాణి పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో కౌన్సిలర్ మల్లేశ్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, కౌన్సిలర్ రవి, జంగయ్యయాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్ పాల్గొన్నారు.

మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో...

జవహర్‌నగర్: మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్ ఆధ్వర్యంలో శనివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్ చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ హాజరై బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రాంకు నివాళులలర్పించిన నేతలు

మేడ్చల్: బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. గ్రామంలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మైనంపల్లితోనే మల్కాజిగిరి అభివృద్ధి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో అభివృద్ధి జరిగిందంటే అది కేవలం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతోనే అని, అలాంటి వ్యక్తిపై విమర్శలు సరికావని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం ఆనంద్‌బాగ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హన్మంతరావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన సమయంలో సుమారు రూ.18 కోట్ల నిధుల పనులు మంజూరయ్యాయన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే పనులు జరుగకుండా అడ్డుకుందని విమర్శించారు. అభివృద్ధిని హన్మంతరావు అడ్డుకున్నారని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్పొరేటర్లు విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల ఆర్టీసీ కాలనీ రోడ్డుకు సంబంధించిన కాలనీ వాసులు మైనంపల్లిని కలిసి వివరించారన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేలా హన్మంతరావు కృషి చేశారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై విమర్శలు చేయడమంటే అభివృద్ధిని అడ్డుకోవడమే అని అన్నారు.

చోరీని అడ్డుకున్న పోలీసులు



నిందితులతో పాటు వాహనాలు, మారణాయుధాలను మీడియాకు చూపుతున్న పోలీసులు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలో మారణాయుధాలతో రెక్కీ నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేయండతో మున్సిపాలిటీ ప్రజలు ఉలిక్కి పడ్డారు. సైబరాబాద్ ఎస్వోటీ, శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా నిఘా పెట్టి నిందితులను అరెస్ట్ చేశారు. శామీర్‌పేట పోలీసులు తెలిపిన మేరకు.. అల్వాల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చింతల రాంరెడ్డి (43) , రంగారెడ్డి జిల్లాకు చెందిన సలీమ్ తమిమి(46), కాప్రా కు చెందిన జెర్రి పోతుల భూమయ్య(48), పెనుబల్లి శ్రీనివాస్(37)లు వివిధ వృత్తుల్లో ఉన్నారు. సంపన్నుల ఇండ్లలో చోరీ చేయాలని నిర్ణయించుకొని మరో ఇద్దరిని (కేరళకు చెందిన అష్రఫ్, కర్ణాటకకు చెందిన తౌసిఫ్) గ్యాంగ్‌లో చేర్చుకున్నారు. ఈ నెల 5న తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోతాయిపల్లిలో నివాసముండే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా నలుగురు నిందితులను పట్టుకున్నామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.ఇదిలా ఉండగా పట్టుబడిన ముఠా సుపారీ గ్యాంగ్ అని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తూంకుంట మున్సిపాలిటీ, పోతాయిపల్లిలో నివాసం ఉండే ఓ బడా రియల్ ఎస్టేట్ వ్యాపారిని హత్య చేసేందుకే ఈ గ్యాంగ్ సుపారీ తీసుకొని రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. నిందితుల వద్ద నుండి విలువైన మహీంద్ర థార్ కారు, ఓ ట్రాలీ ఆటో, 3 ద్విచక్ర వాహనాలు, 5 సెల్ ఫోన్లు, పదునైన కత్తులతో పాటు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

నలుగురి అరెస్ట్

రాంగ్‌రూట్‌లో వెళితే కేసులు నమోదు చేస్తాం



మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్

మేడ్చల్: మేడ్చల్ పట్టణ పరిధిలో, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళితే కేసులు నమోదు చేస్తామని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ హెచ్చరించారు. ఇన్నాళ్లు మేడ్చల్ పట్టణంలో వాహనదారులకు నూతన చట్టంపై, రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై అవగాహన కలిపించామని, ఈనెల 7 నుండి రాంగ్‌రూట్ డ్రైవింగ్ కనబడినా కేసులు చేస్తామని హెచ్చరించారు.

పచ్చదనాన్ని పెంపొందిస్తాం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పార్కులు, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాలలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆమె మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్‌తో కలిసి అరుణోదయ కాలనీ పార్కులో బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులలో పెట్టిన మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందనే ఉద్దేశంతో వాటికి నీటిని అందించేందుకు బోరు పనులను ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్, వేణుగౌడ్, మహేందర్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మేడ్చల్ జిల్లా న్యాయమూర్తి



మేడ్చల్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా న్యాయమూర్తి బాలభాస్కర్

మేడ్చల్: ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ న్యాయస్థాన ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా న్యాయమూర్తి బాలభాస్కర్ పాల్గొని మొక్కలను నాటారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు, న్యాయస్థాన సిబ్బంది కోర్టు ఆవరణలో 220 మొక్కలను నాటారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హన్మంత్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మేడ్చల్: మండలంలోని గౌడవెళ్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు బదిలీపై వెళ్ళిన, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను గ్రామ మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, సురేందర్ ముదిరాజ్‌లు సన్మానించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన జగన్‌రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన సురెందర్‌ముదిరాజ్‌లు టీచర్లను శాలువాలతో సన్మానించి పూలదండలు వేసి వారి సేవలను కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు ,గ్రామ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విరివిగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న చైర్ పర్సన్, కౌన్సిలర్, కమిషనర్

మేడ్చల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్ మానస శ్రవణ్‌కుమార్‌గుప్తా తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ప్రతీ వార్డులో అవసరమున్న చోట అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, కార్యక్రమాలు చేపట్టి విరివిగా మొక్కలు నాటుతామని అన్నారు. పట్టణంలో ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేసి ఇంటి ముందు మొక్కలు పెంచే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు మానస శ్రవన్‌కుమార్‌గుప్తా, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, తుడుం గణేష్ పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ మొత్తం అవినీతిమయం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ప్రధాన కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ మొత్తం అవినీతిమయమైందని ఆరోపించారు. అధికారులు అక్రమ నిర్మాణాలు, అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వాటిపై ఫిర్యాదులు చేసినా విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన అని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జీహెచ్‌ఎంసీని అభివృద్ధి చేయకుండా హైదరాబాద్ పేరును చెడగొట్టేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రజలను చైతన్య పరుస్తూ ప్రతి వేదికపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

కేన్సర్‌ను అరికట్టవచ్చు

మల్లాపూర్: మహిళల్లో అధికంగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, ముందుగానే పరీక్షలు చేయించుకుంటే దానిని అరికట్టవచ్చని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కమల అన్నారు. శనివారం నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో బంజారాహిల్స్ రోటరీ క్లబ్, ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు అనిత నాటిబండ్ల, కార్యదర్శి కేవీమూర్తి, డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, వైద్యులు సావిత్రి, ఫాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేస్ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.



క్యాంప్‌లో పాల్గొన్న సూపరింటెండెంట్ కమల, రోటరీ క్లబ్ ప్రతినిధులు

స్కూల్ ఎదుట ఎస్‌ఎఫ్ఐ ధర్నా



ఓక్లె స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్ఐ విద్యార్థి నాయకులు

మేడ్చల్: ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలోని ఓక్లె ఇంటర్నెషనల్ స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం నుండి అనుమతులు పొందకుండా ఓక్లీ స్కూల్‌ను చట్టవిరుద్ధంగా నడిపిస్తున్నారని అధికారులు వెంటనే స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, బాలకిరణ్, బాబు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో లైంగికదాడి నిందితుడు



మహేష్

కీసర: రాంపల్లి దాయరలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడిని కీసర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. రాంపల్లి దాయరలోని కేఎర్ఆర్ ఇండస్ట్రీస్ వద్ద చిన్న హోటల్ నిర్వహిస్తున్న యజమాని కూతురు శుక్రవారం రాత్రి ఒంటి గంట సమయంలో బాత్‌రూమ్‌కు వెళ్లడాన్ని డీసీఎం డ్రైవర్ మహేష్ గమనించాడు. బాలిక నోరుమూసి డీసీఎం క్యాబిన్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కూతురు కనిపించకపోవడంతో తండ్రి చుట్టుపక్కల గాలించగా డీసీఎం క్యాబిన్‌లో కనిపించింది. దీంతో తండ్రి డ్రైవర్‌ను వెంబడించగా బాలికను క్యాబిన్‌లో నుండి కిందకు తోసేసి డీసీఎంతో పారిపోయాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మహేష్‌ను శనివారం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడు హైదరాబాద్‌లోని బహదూర్‌పురాకు చెందిన వ్యక్తి అని తెలిసింది.

సెల్‌ఫోన్ల చోరీ నిందితుడి రిమాండ్



ఉమేశ్, ఫోన్‌ల చోరీ నిందితుడు

ఘట్‌కేసర్: పట్టణంలోని బ్రూక్‌బ్రాండ్ కాలనీలో రీనాదేవి ఇంటిలో ఫోన్‌లు చోరీ చేసిన నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన మేరకు.. ఈ నెల 6న ఉదయం నిద్ర లేచే సరికి ఇంట్లో మూడు ఫోన్‌లో కనిపించడలేదని రీనాదేవి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో భాగంగా పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణం వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. అక్కడ అనుమానాస్పందంగా కనిపించిన పట్టణంలోని రాంనగర్‌లో నివసించే సొంకేమిలి ఉమేహ (20) వద్ద మూడు ఫోన్లు లభించాయి. అతడిని విచారించగా బ్రూక్‌బాండ్ కాలనీలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

నేడు సంస్కృతి టౌన్‌షిప్‌లో రథయాత్ర

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు భక్తి యోగ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీజగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నారు. సాయంత్రం 7 గంటలకు రథయాత్ర ముగుస్తుందని, అనంతరం 8 గంటలకు ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు మేడ్చల్‌లో రథయాత్రకు హాజరు కానున్న గవర్నర్

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ఆదివారం జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు డబీల్‌పూర్ ఇస్కాన్ ప్రతినిధి తలారీ అశోక్ ముదిరాజ్ తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రధాన వీధులలో యాత్రను సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జంగ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ హజరవుతారని ఆయన తెలిపారు.
అత్వెల్లి శివాలయం నుండి మేడ్చల్ అయ్యప్ప ఆలయం వరకు ఒడిశా వాసుల ఆధ్వర్యంలో మరో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: 2024 సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి విదేశీ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ కోర్సులను అభ్యసించడానికి సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఆర్థిక సహాయం మంజూరు కోసం అర్హత కలిగిన మైనారిటీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కేశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ / డాక్టోరల్ కోర్సులలో జనవరి 2024 నుంచి జులై వరకు ప్రవేశం పొంది ఉండి, అన్నీ అర్హతలు కలిగి ఉన్నవారు మాత్రమే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9492037940/ 9000168256 నెంబర్లకు ఫోన్‌చేయాలన్నారు.

ఈటలను కలిసిన బీజేపీ నేతలు



ఎంపీ ఈటలను సన్మానిస్తున్న గిర్మాపూర్ నాయకులు

మేడ్చల్: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజెందర్‌ను మున్సిపాలిటీలోని గిర్మాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు కలిశారు. ఈటెల నివాసానికి వెళ్ళి నాయకులు ఆయన్ను కలిశారు.పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎంపీకి వివరించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డి ,పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు,బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

నాగారంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని చాముండేశ్వరీనగర్‌లో అభివృద్ధి పనులకు చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16వ వార్డులో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను రూ. రూ. 21 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, నాయకులు మోకు జగన్మోహన్‌రెడ్డి, కొమిరెల్లి సుధాకర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోగులకు ఆహారం అందజేసిన విద్యార్థులు



రోగులకు ఆహారం అందజేస్తున్న విద్యార్థులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రిలో సన్‌ఫ్లవర్ వేదిక్ పాఠశాల విద్యార్థులు సాయి గీత ఆశ్రమం ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా ఆహారం అందజేశారు. ఆస్పత్రిలోకి 300 మంది రోగులకు మధ్యాహ్న భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మాకే నామ్ పే ఏక్ పేడ్'



మొక్కలు నాటుతున్న మాజీ సర్పంచ్ మాధవి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్ గూడలో మాజీ సర్పంచ్ గొంగ్ల మాధవి బాలేష్ ఆధ్వర్యంలో 'మాకీ నామ్ పే ఏక్ పేడ్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో భాగాంగా ఆమె మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు గొంగ్ల బాలేష్, శివకుమార్, సత్యనారాయణరెడ్డి, తౌర్యానాయక్, వీరారెడ్డి, బాలు యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నగలు, నగదు చోరీ

పోచారం: తాళం వేసిన ఇంట్లో నగదు, నగలు చోరీకి గురైన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. చౌదరిగూడలోని వెంకటాద్రిటౌన్‌షిప్ ఫేస్-2లో ఉంటున్న ఇటికెల ప్రవీణ్ కుమార్ (34) శుక్రవారం మధ్యాహ్నం తన కూతురు అనారోగ్యంగా ఉండటంతో ఇంటికి తాళం వేసి నగరంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం శనివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న 23 తులాల బంగారు ఆభరణాలు, 10 వేల నగదు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు తెలిసింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.